క్లుప్తంగా

బీచుపల్లిలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అభయాంజనేయస్వామికి ఆకుపూజ, పంచామృత అభిషేకం వంటి పూజలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



అయిజ: పట్టణంలోని 16 వార్డులో శనివారం విద్యుత్ అధికారులు కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. 16వ వార్డులోని కొత్త కాలనీలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో స్పందించిన అధికారులు 13 విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పనులను మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న పరిశీలించారు.

ఈకేవైసీ కోసం లబ్ధిదారుల అవస్థలు



గద్వాల అర్బన్: ఈకేవైసీ అప్‌డేట్ విషయంలో రేషన్ దుకాణాలు, ఆధార్ సెంటర్ల వద్ద లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అతిఖుర్ రహ్మాన్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు చొరవ తీసుకొని ఈకేవైసీ అప్‌డేట్ తేదీని పొడగించి, నియోజకవర్గానికి ఈకేవైసీ అప్‌డేట్ సెంటర్లను పెంచాలని కోరారు. లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని షాబాద్‌కు చెందిన బీసమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు పీఆర్‌పీ, ఎల్లప్ప, బుచ్చన్న, రాజు ఉన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



ధరూరు: కొన్ని రోజులుగా దోమల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్న నేపథ్యంలో మండల కేంద్రంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఇటీవల జ్వరాల బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో ఫాగింగ్ చేయించారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వర బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. మండల కేంద్రంలో శనివారం రాత్రి వైఎస్ఆర్, అంబేద్కర్ సర్కిళ్లతో పాటు ఆయా కాలనీల్లో సర్పంచ్ పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డిలు ఫాగింగ్ యంత్రంతో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు.

ప్రేమలతకు టికెట్ కేటాయించాలి



ఎర్రవల్లిచౌరస్తా: అలంపూర్ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మహిళా ఉద్యమ నాయకురాలు ప్రేమలత కుర్వ పల్లయ్యకు బీఆర్ఎస్ తరుపున ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని మాదాసి మాదారి కుర్వ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఇటిక్యాల మండల కేంద్రంలో నాయకులు సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు.కార్యక్రమంలో నాయకులు కుర్వ పల్లయ్య, ఠాకూర్ కృష్ణ, సుంకన్న, శంకర్, రాముడు, లక్ష్మన్న, రామాంజనేయులు, నర్సింహ, వెంకటన్న, రాజు, బలరాముడు ఉన్నారు.



నిమజ్జనానికి ట్రాక్టర్‌లో తరలిన గణనాథుడు



కృష్ణమ్మలోకి నిమజ్జనం అవుతున్న గణపయ్య



అలంపూర్ చౌరస్తాలో లడ్డుతో భక్తులు

కృష్ణమ్మ ఒడికి గణపయ్య

- అలంపూర్ చౌరస్తాలో రూ.26 వేలు పలికిన లడ్డు
- ప్రత్యేక పూజలు, అన్నదానం

ఎరవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి కృష్ణానదిలో భక్తులు శనివారం గణనాథులను నిమజ్జనం చేశారు. చుట్టుపక్కల ప్రాంతాలలో గణనాథులను ఆరురోజులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం మండపాల ముందు లడ్డు వేలం పాటలను హోరాహోరీగా నిర్వహించారు. పురవీదుల గుండా గణనాథులను ఊరేగిస్తూ బీచుపల్లి కృష్ణానదికి చేరుకొని క్రేన్ సహాయంతో కృష్ణమ్మ ఒడిలోకి నిమజ్జనం చేశారు.

పేపర్ వినాయకుడి నిమజ్జనం

ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి సరస్వతి పాఠశాలలో ఏర్పాటు చేసిన పేపర్ వినాయకుడిని శనివారం కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అలంపూర్: ఐదోరోజు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మరో వైపు గణనాథులను పలు గ్రామాల్లో నిమజ్జనానికి తరలించారు. అలంపూర్ చౌరస్తాలో గణనాథుడు నిత్య పూజలందుకుని నిమజ్జనానికి తరలించారు. స్వామి వారి లడ్డు వేలంలో రమేష్ నాయుడు రూ.26వేలకు దక్కించుకున్నాడు. స్వామి వారి పూజా సామగ్రి వెంకటేశ్వర్లు రూ. 4,250 దక్కించుకున్నాడు.

వినాయక నిమజ్జనం

రాజోళి: మండలంలో వినాయక నిమజ్జనాల ప్రక్రియ వైభవంగా కొనసాగుతోంది. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వినాయ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి లడ్డు వేలం పాటలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఊరేగిస్తూ సుంకేసుల డ్యాంలో నిమజ్జనం చేశారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో 16 వినాయకులను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రమణరావు వినాయక నిమజ్జనం, లడ్డువేలం పాటలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయరెడ్డి, సినియర్ అసిస్టెంట్ రామకృష్ణ, కార్యదర్శులు సురేష్, అశోక్, మహేష్, నాగరాజు, హరిత, మంజుల, హసీనా పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. ఐదు రాత్రులు పూజలందుకున్న గణనాథుడు ఆరో రోజు శనివారం నిమజ్జనానికి సిద్ధమయ్యాడు. యువత, డప్పు డ్యాన్స్‌లతో అందరిని అలరించారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు

అలంపూర్ రూరల్: మండలంలోని గ్రామాల్లో వినాయకుని మండపాలలో కొలువుదీరిన వినాయకులకు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు ఆటలను నిర్వహించి బహుమతులు అందిస్తున్నారు. అలంపూర్ పట్టణంలో క్రాంతి యువజన సంఘం, ఆర్యవైశ్య సంఘం, అక్బర్‌పేట, వడ్లచారివీధి, పాత బస్టాండ్, చేనేత కాలనీ, న్యూప్లాట్స్, అంబేద్కర్ కాలనీలలో వినాయకుని మండలపాల్లో పూజలు నిర్వహించారు. పట్టణంలోని సాలేవీధిలో ఆదివారం శ్రీ వరసిద్ధి వినాయకునికి మహిళలు గరకతో పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శ్రీహరి, శివ, రామ్, దిలిప్ మనోజ్ తెలిపారు.

గట్టు: వినాయక ఉత్సవాల్లో భాగంగా వినాయక మండపాల దగ్గర గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. చేనేత కార్మికులు ఏర్పాటు చేసిన వినాయక మండపం దగ్గర అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



గట్టు చావిడి దగ్గర అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు



మానవపాడులో నిమజ్జనానికి వినాయకుడిని తరలిస్తున్న అధికారులు



రాజోళిలోని అడివేశ్వర స్వామి ఆలయ గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

చదువుకుంటేనే జీవితాల్లో వెలుగు

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు: చదువుకుంటేనే జీవితాల్లో వెలుగు వస్తుందని, మహిళలు తప్పని సరిగా చదువుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. శనివారం ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో బడీడు పిల్లలంతా బడికి వెళ్లాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్షరాస్యతలో అట్టడుగులో ఉన్న ప్రాంతంగా గట్టుకు గుర్తింపు ఉండేదని, దానికి భిన్నంగా ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. బాలికల విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. పెద్ద మొత్తంలో గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. ఉచితంగా ఈ యాప్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. డిగ్రీ చదివిన వారికి ఉద్యోగ అవకాశాలను తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. స్టేట్ కన్జ్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గట్టును విద్యాపరంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టిని సారించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

పంచాయతీ రాజ్ కార్యాలయం ప్రారంభం

మండల కేంద్రంలోని సంత బజారులో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం ఉప కార్యనిర్వాహక కార్యాలయాన్ని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్మన్ జంబురామ న్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, బీఆర్ఎస్ నేత నాగర్‌దొడ్డి వెంకట్రాములు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో వరద బాధితులు



అలంపూర్ రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వరద బాధితుల సందడి నెలకొంది. 2009లో వచ్చిన వరదలలో సర్వం కోల్పోయిన బాధితులకు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వెనకాల స్థలం తీసుకోని బాధితులకు పట్టాలు ఇచ్చారు. ఇందుకు సంబంధించిన పట్టాల లబ్ధిదారుల జాబితాలో ఉన్న వార ఆధార్‌కార్డు, ఆహారభద్రత కార్డు, రెండు పోటోలు రెవెన్యూ సిబ్బంది తీసుకుంటున్నారు. దీంతో లబ్దిదారులు తహసీల్దార్ కార్యాలయానికి రావడంతో సందడి నెలకొంది.

ఆదిశిలా క్షేత్రంలో జెడ్పీచైర్‌పర్సన్ పూజలు



ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జెడ్పీచైర్ పర్సన్ సరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఈఓ సత్యాచంద్రారెడ్డి, అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి మెమెంటోను అందజేశారు. అనంతరం పెద్దొడ్డికి చెందిన రఘుపతి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మల్దకల్ స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతా రామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఆది శిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాలలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాబురావు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

వాల్ పోస్టర్ విడుదల



ధరూరు: మండల ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఫొటో ఎక్స్‌పో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. అక్టోబర్ 6, 7, 8వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ఫొటో ఎక్స్‌పో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మండల అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్ శనివారం వైఎస్సార్ చౌరస్తాలో విడుదల చేశారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో గద్వాల మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కోశాధికారి శ్యాం, ప్రధాన కార్యదర్శి రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

అయిజ: మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని హమాలీ కార్మిక సంఘం కార్యాలయంలో మధ్యాహ్న భోజన వసతి కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడారు. ప్రభుత్వం పెంచిన రూ.2వేలు పారితోషికాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, కార్మికులకు ప్రమాద బీమా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఈశ్వర్, మధ్యాహ్న భోజన వసతి కార్మికులు మల్లేశ్వరమ్మ, వీరేశమ్మ, సరోజమ్మ, గోవిందమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీవీ నరసింహ

కొత్త కమిషన్ ద్వారా పరీక్షలు నిర్వహించాలి



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్

ఎర్రవల్లిచౌరస్తా: టీఎస్‌పీఎస్సీ ద్వారా చేపట్టే పరీక్షలన్నీ కొత్త కమిషన్ ద్వారా నిర్వహించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందికంటి విజయ్ కుమార్ అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్–2 పరీక్ష రెండోసారి రద్దు కావడానికి కేసీఆర్ నిరంకుశ కుటుంబ పాలనే కారణమన్నారు. గతంలో బీఎస్పీ డిమాండ్ చేసినట్లుగా కమిషన్‌ను ప్రక్షాళన చేసి పరీక్షలను నిర్వహించి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదన్నారు. తక్షణమే కమిషన్ మొత్తాన్ని రాజీనామా చేయించి నూతన కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, యువరాజు, పరశురాముడు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం



బిజ్వారంలో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని బిజ్వారం జెడ్పీహెచ్ఎస్‌లో స్టేట్‌కాజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తరగతి గది ప్రారంభోత్సవానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చిబాబు, సంస్థ నిర్వాహకులు శ్రీవర్ధన్‌రెడ్డి, పవన్, సుజల్, హేమంత్, సాహితి, లవన్న, విష్ణు, ప్రేమ్‌రాజు, లక్ష్మన్న, పురుషోత్త, దస్తగిరి, గోపాల్, కిష్టన్న, దొడ్డెన్న పాల్గొన్నారు.

నానో యూరియాను వినియోగించాలి

ఎర్రవల్లిచౌరస్తా: నానో యూరియాను వాడటం వల్లే మొక్కలు త్వరితగతిన ఎదుగుతాయని ఏడీఏ సక్రీయ నాయక్ అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురంలో ఏఈఓ మౌనిక ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియాను వాడటం వల్ల రైతులు తక్కువ శ్రమతో అధిక దిగుబడిని సాదించవచ్చన్నారు. కార్యక్రమంలోశివుడు, నర్సింహులు, శివన్న, గోపాల్, బీసన్న, నరేందర్, రైతులు ఉన్నారు.

గద్వాల వ్యవసాయం: రైతులు పంటలకు నానో యూరియాను విరివిగా వినియోగించాలని ఏడీఏ సంగీత లక్ష్మి సూచించారు. శనివారం గద్వాల మండలంలోని చెనుగోనిపల్లి రైతువేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులకు, రైతులకు 'నానోయూరియా' వినియోగంపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నానో యూరియా వాడటం వల్ల పంట పెట్టుబడులు తగ్గుతాయని చెప్పారు. వాయు, నేల కాలుష్యం తగ్గుతుందన్నారు. ఈ యూరియాను పంట ఎనభై శాతం గ్రహిస్తుందని, దీనివల్ల పంటకు ఎలాంటి దుష్పరిణామాలు ఉండన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రతాప్, ఇఫ్కో ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ సంగీత లక్ష్మి

ధరూరు: ఇటీవల మార్కెట్‌లోకి వచ్చిన నానో యూరియాతో ఎన్నో ఉపయోగాలున్నాయని ఏఈఓ శివరాజ్ తెలిపారు. ఆయన మండలంలోని కోతులగిద్దలో నానో యూరియాపై అవగాహన కల్పించారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి హుండీ లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని శనివారం ఈఓ పురేందర్ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. 10 నెలల నుంచి వచ్చిన హుండీ ఆదాయం రూ. 6,56,726 వచ్చినట్లు ఏఓ పురేందర్ తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరి, ఆలయ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం విద్యార్థినీలకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపతి నాయుడు మాట్లాడారు. క్రమశిక్షణ, విద్యతోనే ఉత్తమ భవిష్యత్ ఉంటుందన్నారు. సమయాన్ని వృథా చేయకుండా చదివితేనే ఉన్నతంగా స్థిరపడవచ్చన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఫ్రెషర్స్ డేలో భాగంగా విద్యార్థినీలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. వెల్‌కం డ్యాన్స్, తెలుగు సంప్రదాయ నృత్యాలు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలరిస్తూ సందడి చేశారు. అనంతరం పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థినీలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకు ముందు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీపీడీసీ మెంబర్ సాయి శ్యామ్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థినీలు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న జీహెచ్‌ఎం నరేష్

మల్దకల్: పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జీహెచ్‌ఎం నరేష్ సూచించారు. శనివారం మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి చదువు పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు పాఠశాలకు సక్రమంగా పంపించాలన్నారు. పిల్లలను పొలం పనులకు తీసుకెళ్లడం వలన వారి చదువుకు ఆటంకం కలుగుతుందన్నారు. తరగతి గదిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎస్‌టీపీపై అవగాహన కలిగి ఉండాలి

అయిజ: పట్టణ ప్రజలు ఎఫ్ఎస్‌టీపీ, డంపింగ్ యార్డ్ పై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. శనివారం పర్దీపురం ఆవరణలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టీపీ (మల, బురద, వ్యర్థాల ఎరువు తయారి విధానం), డంపింగ్ యార్డ్‌పై బీజీఆర్, లయోలా పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు వారి ఇండ్లలోనే తడిచెత్తను ఎరువుగా తయారు చేసుకునే విధానంపై వివరించారు. ఎఫ్ఎస్‌టీపీలో మానవ వ్యర్థాలను, నీటిని వేరుచేసి ఎరువుగా మారుస్తారని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య

కార్యక్రమంలో ఇన్విరాన్మెంటల్ ఇంజినీర్ సురేష్, మున్సిపల్ సిబ్బంది లక్ష్మన్న, భరత్, నరేష్, శివ, శంకర్‌రెడ్డి, వీరేష్, ప్రకాష్, విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

అలంపూర్: ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆశా వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలని తహసీల్దార్ మంజులకు సీఐటీయూ అధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పీఎఫ్, ఈఎస్ఐ వంటి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకు విధుల్లోకి వెళ్లరని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం మండల కార్యదర్శి నాగేశ్వరమ్మ, భారతి, పద్మ, చిట్టెమ్మ, ప్రమీల, విజయమ్మ, బి.పద్మావతి, శివలీల, జయమ్మ ఉన్నారు.

తాగునీటి కోసం విద్యార్థుల అవస్థలు

గట్టు: మండలంంలోని ఆలూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తాగు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాల ఆవరణలో తాగునీటి వసతి లేక ఇబ్బంది పడుతున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆలూరు ఉన్నత పాఠశాల ఆవరణలో నెలకొన్న తాగు నీటి సమస్యపై సామాజిక మాద్యమాల్లో పోస్టు చేసిన వ్యవహారం వైరల్‌గా మారింది. భోజనం చేసిన తర్వాత విద్యార్థులు తాగునీటి కోసం గ్రామంలోకి పరిగెత్తే పరిస్థితి ఉన్నట్లు తెలిపారు. భోజనం మధ్యలో నీటి అవసరం ఉన్నా, గుక్కెడు నీరు లభించదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. అధికారులు స్పందించి తాగు నీటి వసతిని కల్పించాలని వారు కోరుతున్నారు.